# నీడలేని పందిరి

అయిదు దాటింది. మేనెల సాయంకాలపు ఎండ కిటికీలోంచి గోడమీదకు ఎక్కింది. గదిలో ఉక్కగా ఉంది. కిటికీ రెక్కలు తెరిచి ఉన్నా గాలి బయటే తచ్చాడుతోంది. ప్రోగ్రెస్ కార్డులు ఇంకా పూర్తి కాలేదు. ఎప్పటికప్పుడు చేసుకుంటూ వెళ్తే ఇలా పేరుకుని ఉండేవి కావు. ఎంత చేసినా తరగటం లేదు. విసుగుతో తలనొప్పి మొదలయింది. స్టాఫ్ రూంలోంచి హెడ్మాస్టరు గది కనబడుతోంది. తల కాయితాల్లోకి వంచుకుని పాసయిని వాళ్ల జాబితా పూర్తి చేయటంలో మునిగిపోయాను.

సిగరెట్ తీసి వెలిగించాను. వేడివేడి టీ తాగితే కాని తలనొప్పిని అరికట్టలేను. మిగిలిపోయిన కార్డులు ఎప్పటికి పూర్తి అవుతాయో అర్థం కావటం లేదు. వాలీబాల్ కోర్టులోంచి ఆడుతున్న కేకలు వినిపిస్తున్నాయి. డ్రిల్లు మాస్టారు ఒక పక్క కోర్టంతా తనే అయి ఆడుతున్నాడు. స్కూలు బంట్రోతు దానయ్య నిలబడి ఆట చూస్తున్నాడు.

“దానయ్యా” కేకేశాను.

దానయ్య నావంక విసుగ్గా చూశాడు.

“ఇలారా” చేయి ఊపాను.

అయిష్టంగానే కిటికీ దగ్గరకు వచ్చాడు. ఏ పనయినా దానయ్యతో చేయించుకోవటం తేలికకాదు. దానయ్య చేతిలో అర్థరూపాయి పెట్టి “నువ్వొక టీ తాగి నాకో టీ తెచ్చిపెట్టు” అన్నాను. స్కూలు పక్కనే హోటలు ఉంది. అందులో టీ తప్ప ఏమీ ఉండదు.

దానయ్య వెళ్లిపోగానే ప్రోగ్రెస్ కార్డులు ముందుకు లాక్కున్నాను. నాలుగురోజుల కిందట పరీక్షలు ముగిశాయి. పేపర్లు దిద్దటం మొన్నే పూర్తి అయింది. నిన్న పాస్‌లిస్టు హెడ్మాస్టరికిచ్చాను. ఈ రోజు ప్రోగ్రెస్‌కార్డులు ఆయనకు అందించాలి. రేపు ఉదయం ఫలితాలు వెల్లడిస్తారు. రేపు మధ్యాహ్నం బస్సు ఎక్కితే రాత్రి ఎనిమిదింటికల్లా మా ఊళ్ళో ఉంటాను. ఒక్క సంవత్సరానికే ఇక్కడి జీవితం విసుగు పుట్టింది. అడుగడుగునా రాజకీయ వాసన కొడ్తుంటుంది. ఇక్కడ నుండి ఎప్పుడు బయట పడదామా అని ఉంది.

మూడు కార్డులు పూర్తి చేశానో లేదో రాఘవయ్య మాస్టారు గదిలోకి వస్తూ, "ఏమిటీ సార్, అందరూ ఆడుకుంటుంటే మీరింకా ప్రోగ్రెస్ కార్డుల మీదే కూర్చున్నారు" అన్నాడు.

"ఇంకా పూర్తికాలేదండీ" అన్నాను.

రాఘవయ్య కుర్చీ లాక్కుని నా ముందు కూర్చుని, "ఈ బెడద నిన్నటితోనే వదిలించుకున్నాను" అన్నాడు.

"మీ ఏడోక్లాసులో ఎంతమంది పాసయ్యారు?"

"ఎంతమంది పాసయ్యారని అడగకండి. ఎంతమంది నెట్టబడ్డారు? అని అడగండి."

"ఏం?"

"సరిగ్గా దిద్దితే అయదు మంది కన్నా ఎక్కువ పాస్ కారండీ. ఏం చేసినా లాభంలేని వాళ్ళను తప్ప, మిగిలిన వాళ్లనందరినీ నెట్టేశాను. మీ క్లాసులో ఎంతమందిని పాస్ చేయించారు?"

"తొంబయి పర్సంటు."

"గుడ్. వెరీగుడ్."

"లేకపోతే వచ్చే సంవత్సరం పదో తరగతికి ఈ స్కూల్లో పిల్లలుండరు."

"చదువుకుని చావరు. చెప్పీ చెప్పీ విసిగి పోయి చదువుకోండ్రా అని చెప్పటంమానేశాను. మీకు చెప్పానో లేదో ఒకసారి ఏమయిందంటే మా క్లాసు పిల్లలకు ఇంగ్లీషు పాఠం చెప్పి కఠినంగా ఉన్న పదాలకు అర్థాలు చెప్పి కంఠతా పెట్టమని, రేపడుగుతానని చెప్పాను. యస్. సార్ అన్నారంతా. ఆ మరుసటిరోజు అడిగాను. టేక్ అంటే అర్థం ఏమిట్రా? అని నేను అడగటం ఆలస్యం నేచెప్తానంటే నేను చెప్తానని దాదాపు అందరూ చేతులెత్తారు. అందరూ ఉత్సాహంగా ఉన్నారు. మా క్లాసు మారిపోతున్నదని, అందరూ చదువుకుంటున్నారని నాకూ సంతోషం వేసింది. అందరూ చెప్పేట్టుగానే అనిపించారు. అందరికన్నా ముందు చేయి ఎత్తిన కుర్రాడిని లెమ్మని, 'టి.ఎ.కె.యి. – టేక్ అర్థం చెప్పరా అన్నాను. వాడు లేచి ఉత్సాహంగా చేతులు కట్టుకుని, మరేసార్, మరేనండీ టేకంటే చెక్క అన్నాడు."

నాకు నవ్వాగలేదు. రాఘవయ్య గమ్మత్తుగా మాట్లాడుతుంటాడు. "ఇంకోసారి .. చెప్పబోతున్నాడు. అంతలో దానయ్య వచ్చి "టీ లేదండీ. పాలు విరిగి పోయాయట" అని వెళ్లిపోయాడు. అర్థరూపాయి తిరిగివ్వలేదు. "చెప్పండి" అన్నాను.

"ఇంకోసారి మా క్లాసు కుర్రాడు నా దగ్గిరకు వచ్చి, 'మాస్టారూ, మా ఇంట్లో మొక్కజొన్న కండెలున్నాయండీ. పట్టు కొస్తాను' అన్నాడు. వద్దురా అన్నాను. బెండకాయలున్నాయన్నాడు. రాంములక్కాయలున్నాయన్నాడు. ఏది కావాలంటే అది తీసుకొచ్చి ఇస్తానన్నాడు. ఏమీ వద్దురా అన్నాను. వాడు వెళ్లకుండా బిక్క ముఖం వేసి నిలబడే ఉన్నాడు. ఏం తీసుకోకపోతే పోయె. నాకు ఇంగ్లీషులో మార్కులు వేయండి అన్నాడు. మార్కులు తక్కువ వస్తుంటే వాళ్ల నాన్న తంతున్నాడట."

నవ్వుతూ చివరంటా కాలిన సిగరెట్‌ను కిటికీ లోంచి బయటకు విసిరాను.

రాఘువయ్య లేచి నుంచున్నాడు.

"కూర్చోండి సార్. మీ మాటలు బావుంటాయి" అన్నాను.

"ఆట ఆడదామని వచ్చాను. మీరూ రాకూడదూ?"

తల అడ్డంగా ఆడించి ప్రోగ్రస్ కార్డులు ఎత్తి రాఘువయ్యకు చూపించాను.

మిగిలిన ప్రోగ్రస్‌కార్డులు పూర్తిచేయటానికి అరగంట పైగానే పట్టింది. అన్నీ కట్టకట్టి హెడ్మాస్టరు బల్లమీద పెట్టి, "అన్నీ పూర్తయి పోయాయి" అన్నాను.

"గుడ్. వెరీగుడ్" అంటుంటే గది బయటకు వచ్చాను. వాలీబాల్ కోర్టు పూర్తిగా ఆటలో మునిగిపోయి హడావిడిగా ఉంది. ఎండ పల్చనయి చల్లబడుతోంది. కొద్దిసేపు నిలబడి ఆట చూద్దామని ఉంది కాని రేపు వెళ్ళిపోవటానికి అన్నీ సర్దుకోవాలని గుర్తురాగానే బయటకు వచ్చాను. వచ్చే సంవత్సరానికి రావాలని లేదు. పై చదువులకు వెళ్దామని ఉంది.

భోజనం చేసి నిద్ర పోదామనుకునేంతలో తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. లేచి కూర్చుని, "ఎవరూ?" అన్నాను.

"నేను సార్, యాదగిరిని."

మంచం దిగి వెళ్లి తలుపు తెరిచి లైటు వేశాను. యాదగిరి జుట్టు రేగిపోయి ఉంది. పరుగెత్తుకుంటూ వచ్చినట్టున్నాడు, ఆయాసం తగ్గలేదు. అరుగుమీద కూర్చుని,"కూర్చో" అన్నాను. కూర్చున్నాడు. "ఏమిటింత రాత్రి పూట వచ్చావు?" అడిగాను.

"మీతో ఒక విషయం చెప్పి వెళ్దామని వచ్చాను."

"చెప్పు."

యాదగిరికి పధ్నాలుగు సంవత్సరాలుంటాయి. సన్నగా, పొడుగ్గా, నల్లగా ఉంటాడు. తొమ్మిదోక్లాసు చదువుతున్నాడు. వాడు క్లాసు మానిటర్. వాడంటే క్లాసేకాదు, స్కూలంతా భయపడుతుంటుంది. ఎవరినీ లెక్కచేయడు. ఆ ఊరి ప్రెసిడెంటు కొడుకు. వాడికి పొట్టపొడిస్తే అక్షరం రాదు. తొమ్మిదోక్లాసు వరకు ఎలా రాగలిగాడో నాకింతవరకు అర్థం కాని విషయం. నాతో నాలుగయిదు సార్లు పోట్లాట పెట్టుకుంటే నేనూ గట్టిగా అరిచి 'నీకు ఇష్టంలేకపోతే నా క్లాసులకు రావలసిన పనిలే'దన్నాను. ఎప్పుడయినా వస్తుంటాడు కాని గొడవ పెట్టుకోలేదు. వాడంటే నాకే కాదు. టీచర్లలో చాలామందికి మంచి అభిప్రాయం లేదు. నేనంటే బయట పడ్డాను. మిగిలిన వాళ్లు బయట పడలేదు.

పరీక్షలకు ముందు యాదగిరి తండ్రి వెంకటస్వామి ఏదో పనిమీద స్కూలుకు వచ్చినప్పుడు నన్ను కలిసి, "మా వాడు సైన్సులో పూర్. నువ్వు గట్టెక్కించాలి" అన్నాడు.

"ముందు పరీక్షలు కానీయండి."

అతను వెళ్ళిపోబోతూ నాకళ్లల్లోకి సూటిగా చూస్తూ ఏదో అనబోయాడు కాని అనలేదు. నేనంటే ఇష్టం లేదన్న సంగతి నాకు అర్థం అయింది. అయినా యాదగిరి ఒక్క సైన్సులో కాదు. ప్రతి సబ్జక్ట్‌లోనూ 'పూర్'. వాడి దురదృష్టవశాత్తూ ఈ సంవత్సరం తొమ్మిదోక్లాసు నాదయింది. యువక రక్తం కాబట్టి ఏదో ఉద్ధరించాలనే ఆలోచనలో ఉన్నవాడిని. ఈ సంవత్సరం కొంతలో కొంత సాధించాను.

తొమ్మిది గంటలకే ఊరు సద్దుమణిగింది. చెరువు మీంచి చల్లటిగాలి వీస్తోంది. సిగరెట్ వెలిగించి, "చెప్పరా" అన్నాను.

'మా రిజల్సు ఎన్ని గంటలకు చెబుతారండీ?" నెమ్మదిగా అడిగాడు.

"నీకు తెలియదా?"

"మీ ఊరు ఎప్పుడు వెళ్తున్నారు?"

"రేపు ఉదయం."

"రేపు పదకొండు గంటల బస్‌కా?"

"ఉన్నది అదే కదా?"

తెలిసే అడుగుతున్న ప్రశ్నల్లా అనిపిస్తున్నాయి.

"మళ్లీ రారుకదా?"

"రాను. రాకూడదనుకుంటున్నాను."

"నాకు సైన్సులో ఎన్ని మార్కులు వచ్చాయండి?"

వాడికి ఏఏ సబ్జక్టులో ఎన్నెన్ని మార్కులు వచ్చాయో నాకు గుర్తు ఉంది కాని "గుర్తులేదురా" అన్నాను.

"పదిహేను వచ్చాయట."

నా చేతిలోంచి సిగరెట్ జారి కిందపడిపోయింది. ముందుకు వంగి అందుకున్నాను.

నవ్వి, "నాకు సంతోషకరమయిన వార్తేమిటంటే నేను తప్పాను. ఈ సాయంత్రం హెడ్మాస్టరుగారు మా ఇంటికి వచ్చి మా నాన్నగారికి చెప్పి వెళ్లారు" అన్నాడు.

చదువుల తల్లి మీద జాలివేసింది.

"మాస్టారూ! నాకు చదువు రాదండి. చదువుకోనంటే మానాన్న ఊరుకోడు. గొడ్డను బాదినట్లు బాదుతాడు. మా అన్న చదువుకుంటానంటే వాడిని చదువుకోనీయకుండా పొలం పనులకు పంపుతున్నాడు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం మాస్టార్లకు డబ్బులిచ్చో, భయపెట్టో నన్ను ఒక్కో క్లాసు పాస్ చేయిస్తున్నాడు. డొనేషన్ కట్టి నన్ను డాక్టర్ కోర్సులో చేర్పించాలని అనుకుంటున్నాడు. నా సత్తా నాకు తెలుసు. నాది మొద్దుబుర్ర... అందరి మీద ఎదురుతిరుగుతున్నానంటే ఎవరి మీదా కోపంతో కాదు. మా నాన్న మీద ఇష్టంలేక. ఆయన మీద కోపం ఎదుటివాళ్ళ మీద చూపించటం. ..." ఆగాడు. వాడి గొంతు గాద్గదికమవుతోంది.

ఈ పూట యాదగిరి నాకు కొత్తగా అవుపిస్తున్నాడు. కొద్దిసేపు మౌనంగా ఉండి "మాస్టారూ! రేపు మీరు ఊరు వెళ్ళే బదులు ఈ రాత్రికి ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వెళ్లిపోండి..." యాదగిరి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నా రెండు చేతులు పట్టుకుని, "మీరంటే నాకు చాలా ఇష్టం మాస్టారూ. నన్ను నమ్మండి. నన్ను పాస్ చేయించనందుకు రేపు అందరి ముందు మిమ్మల్ని కొట్టిద్దామని మా నాన్న ప్రయత్నిస్తున్నాడు" అన్నాడు యాదగిరి.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక – 19 మే 1967